క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



భిక్కనూరు : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను చాటినందును శుక్రవారం వారిని కళాశాలలో సన్మానించారు. ఈ ప్రేమ్‌కుమార్‌, జే తారక్‌, జగదీశ్వర్‌, ప్రవీణ్‌లు అత్యుత్తమ ప్రతిభతో ఐఐటీలో సీట్లు సాధించడం గర్వకారణమని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌ నర్సింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడికి..



ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాలకిషన్‌ను పతంజలి యోగా సమితి సభ్యులు శుక్రవారం సన్మానించారు. ఎల్లారెడ్డి నుంచి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బాలకిషన్‌ను యోగా సమితి సభ్యులు నాగరాజుగౌడ్‌, నర్సింహారావు, మారుతిరావు తదితరులు శాలువాతో సన్మానించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



కామారెడ్డి రూరల్‌ : కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్‌ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీబాట కార్యక్రమంలో భాగంగా 11 వ వార్డ్‌ కౌన్సిలర్‌ కాసర్ల శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని తల్లులకు బీసీ స్కూల్‌ టీచర్స్‌ లక్ష్మి, పద్మ, పద్మావతి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌ ఉమారాణి వైద్య, ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న పోలీసులు



రామారెడ్డి : రోడ్డు మార్గంలో వెళ్తున్న ఓ యువకుడి పర్సు పోలీసులకు దొరకగా సదరు వ్యక్తికి శుక్రవారం పోలీసులు అందజేశారు. గురువారం సాయంత్రం కొట్టాల్‌ పల్లికి చెందిన బదావత్‌ భాస్కర్‌ కామారెడ్డి నుంచి కొట్టాల్‌ పల్లికి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో అతడి పర్సు పడిపోగా, రామారెడ్డి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామారెడ్డి పోలీస్‌ సిబ్బంది పర్సు వెతికి తెచ్చి భాస్కర్‌కు శుక్రవారం అందజేశారు. హెడ్‌ కానిస్టేబుల్‌ రాజనర్సయ్య, కానిస్టేబుల్‌ సంపత్‌, గణేశ్‌ తదితరులున్నారు.

‘ఈగల బెడద నుంచి కాపాడండి’



రాజంపేట : మండలంలోని తలమడ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పౌల్ట్రీ ఫాం నుంచి వస్తున్న ఈగల కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని తలమడ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పౌల్ట్రీ ఫాం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా సంబంధిత మేనేజ్‌మెంట్‌ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

జాబ్‌మేళా విజయవంతం



కామారెడ్డి టౌన్‌ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో హెచ్‌సీఎల్‌ ఆధ్వర్యంలో ఇంటర్‌ విద్యార్థులకు శుక్రవారం జాబ్‌మేళా విజయవంతంగా నిర్వహించారు. ఇంటర్‌లో సీఈసీ, హెచ్‌ఈసీ, వొకేషనల్‌ కోర్సులు పూర్తి చేసిన 100 మందికిపైగా విద్యార్థులు ఈ జాబ్‌మేళాకు హాజరైనట్లు జిల్లా ఇంటర్‌ నోడల్‌ అధికారి షేక్‌సలాం తెలిపారు. పరీక్ష నిర్వహించి ఐదుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కంపనీ ప్ర తినిధులు రాజేష్‌ కుమార్‌, ఉపాధ్యాయులు, వి ద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా కాలనీలు

- లోపించిన పారిశుధ్యం
- ఎక్కడి చెత్త అక్కడే..
- రోడ్లపైనే మురికినీరు



డిపో ఆవరణలో చెత్తాచెదారం



బీడీ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురికి నీరు

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పట్టణంలోని పలు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు రోడ్లపై మురికి నీరు పారుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపించే అవకాశాలున్నాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

ఎటు చూసినా దుర్గంధమే..

పట్టణంలోని బీడీ కాలనీ, లింగారెడ్డిపేట తండా, పోలీస్‌స్టేషన్‌ పరిసర ప్రాంతాలలో చెత్త కుండీల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు బీడీ కాలనీ ఆవరణ, ఒడ్డెర కాలనీ ఆవరణలో రోడ్లపై మురికినీరు పారుతుండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ప్రారంభం కానున్న దృష్ట్యా మురికి నీటి కాలువల్లో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపించే అవకాశాలున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా కాలనీలలో చెత్తాచెదారం పేరుకుపోతోందని అధికారులు స్పందించి చెత్తను తొలగించి, మురికి నీరు రోడ్లపై పారకుండా తగిన చర్యలను తీసుకోవాలని ఆయా కాలనీ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

పట్టణంలోని పలు కాలనీలలో చెత్తాచెదారం పేరుకుపోయిన విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే చెత్తను తొలగిస్తాం, మురికి నీరు రోడ్లపై పారకుండా తగిన చర్యలు తీసుకుంటాం. కొద్ది రోజులుగా పారిశుధ్య సిబ్బంది ఎన్నికలకు సంబంధించిన పనుల్లో ఉండడంతో పారిశుధ్యంలో కొంత ఇబ్బంది జరిగింది. ఇక నుంచి పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలను తీసుకుంటాం.

– శ్రీహరిరాజు, మున్సిపల్‌ కమిషనర్‌, ఎల్లారెడ్డి

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి





నాగిరెడ్డిపేటలోని సీడ్స్‌ దుకాణంలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్‌ అధికారులు, ఎల్లారెడ్డిలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని టాస్క్‌ఫోర్స్‌ అధికారులు సూచించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల పలు విత్తన డీలర్‌షాపులను శుక్రవారం కామారెడ్డి నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్‌ బృందం అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలలో టాస్క్‌ఫోర్స్‌ బృందం సభ్యులు కామారెడ్డి ఏడీఏ అపర్ణ, కామారెడ్డి, దోమకొండ ఏవోలు శ్రీనివాస్‌, పవన్‌కుమార్‌, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి ఎస్సైలు రాజు, మహేష్‌ ఉన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్‌ అధికారులు సీడ్స్‌ దుకాణదారులకు సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో పలు సీడ్స్‌ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం రైతులకు విక్రయించిన సీడ్స్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్‌ అధికారిణి కామారెడ్డి ఏడీఏ అపర్ణ మాట్లాడుతూ దుకాణదారులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మి మోసం చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో దోమకొండ, కామారెడ్డి, ఎల్లారెడ్డి ఏవోలు శ్రీనివాస్‌, పవన్‌, హరీశ్‌కుమార్‌, ఎస్సై మహేష్‌ తదితరులున్నారు.



గాంధారిలో..

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి) : విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందుల దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వ్యవసాయ శాఖ టాస్క్‌ ఫోర్స్‌ అధికారులు హెచ్చరించారు. మండల కేంద్రంలో పలు దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏడీఏ అపర్ణ, గాంధారి, కామారెడ్డి, దోమకొండ ఏవో నరేష్‌, శ్రీనివాస్‌, పవన్‌ పాల్గొన్నారు.

శాంతికమిటీ సమావేశాలు..



మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌



మాచారెడ్డిలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆయా మండలాల్లో శుక్రవారం నిర్వహించిన శాంతికమిటీ సమావేశాల్లో వారు మాట్లాడుతూ గోవధ నిషేధమన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న ఎస్సై రాజు



పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడుతున్న ఎస్సై కోనారెడ్డి



పిట్లం సంతలో మాట్లాడుతున్న ఏఎస్సై లింబాద్రి

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు అయ్యేలా చూడాలి



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో బీసీజీ టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గైని అనసూయ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్‌ స్కూల్‌లోని విద్యార్థులకు నోట్‌ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శ్రద్ధతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ భానుమతి, ఎంపీటీసీ బీరయ్య, విండో చైర్మన్‌ కమలాకర్‌ రావు, రమేశ్‌, వడ్ల రాజేందర్‌, బంటు భూమేశ్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి) : యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఐఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్‌ అమృత రాజేందర్‌ రావు సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని లింగంపల్లిలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామంలో 45 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. జిల్లా ఎయిడ్స్‌ నియంత్రణ అధికారి చల్ల సుధాకర్‌, రవళి, శివాజీరావు, విఠల్‌ రావు, సంతోష్‌, బ్లడ్‌ బ్యాంక్‌ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడికోటలో అక్షరాభ్యాసం

దోమకొండ : మండల కేంద్రంలోని గడికోటలో శనివారం ఉదయం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు గడికోట ట్రస్ట్‌ మేనేజర్‌ బాబ్జి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేద బ్రాహ్మణుల చేత అక్షరాభ్యాస కార్యక్రమం ఉంటుందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలతో అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. గడికోట ట్రస్ట్‌ ఆధ్వర్యంలో చిన్నారులకు కావాల్సిన వస్తువులను సమకూరుస్తామని వివరించారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న హెచ్‌ఎం

రామారెడ్డి : రెడ్డిపేట విద్యార్థులు గురువారం విడుదల చేసిన ఎన్‌ఎంఎంఎస్‌ ఫలితాల్లో పీఎం శ్రీ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల రెడ్డి పేట విద్యార్థులు ఇద్దరు స్కాలర్‌షిప్‌కు ఎన్నికైనట్లు హెచ్‌ఎం గోపాల్‌ రెడ్డి శుక్రవారం తెలిపారు. స్కాలర్షిప్‌లకు ఎంపికైన విద్యార్థులు మోలుగు హాసిని, గాండ్ల చరణ్‌ ఎంపీటీసీ రాజాగౌడ్‌ హెచ్‌ఎం, గ్రామస్తులు అభినందించారు. వీరిద్దరికి రూ. 12,000 ఏడాదికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గర్గుల్‌ రాజాగౌడ్‌, హెచ్‌ఎం గోపాల్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో..



పవిత్ర

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మాల్తుమ్మెద హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థుల తోపాటు గోలిలింగాల ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని ఎన్‌ఎంఎంఎస్‌ (నేషనల్‌ మీన్‌ కం మెరిట్‌ స్కాలర్‌షిప్‌) పథకానికి ఎంపికయ్యారు. మాల్తుమ్మెద హైస్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థులు కుడికాల సహస్ర, జంగం భువనేశ్వరీ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటరాజు తెలిపారు. దీంతోపాటు గోలిలింగాల యూపీఎస్‌లోని 8వ తరగతి విద్యార్థిని ఎస్‌.పవిత్ర ఎంపికై నట్లు హెచ్‌ఎం వెంకటేశం తెలిపారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ





కల్యాణి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న టీచర్లు, బాన్సువాడ రూరల్‌లో..





దేవునిపల్లి హైస్కూల్‌లో దుస్తులు అందజేస్తున్న కౌన్సిలర్లు, బీబీపేటలో..

ఎల్లారెడ్డి : మండలంలోని కల్యాణి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్‌, సుమన్‌, బాలకిషన్‌ తదితరులున్నారు.

బీబీపేట : మండల కేంద్రంలోని టీఎస్‌ఎన్‌ఆర్‌ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పాఠ్య పుస్తకాలను పాఠశాల హెచ్‌ఎం రవీంద్రరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

బాన్సువాడ రూరల్‌ : బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకట రమణ శుక్రవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ యూనిఫాంలను పంపిణీ చేశారు. గ్రామస్తులు సతీష్‌గౌడ్‌, జనార్ధన్‌రెడ్డి, మద్దెలచెరు గంగారాం తదితరులున్నారు.

కామారెడ్డి అర్బన్‌ : దేవునిపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. 12వ వార్డు కౌన్సిలర్‌ కాసర్ల గోదావరి, 35వ వార్డు కౌన్సిలర్‌ పి.కృష్ణాజీరావు, హెడ్‌మాస్టర్‌ గంగాకిషన్‌, బీఆర్‌ఎస్‌ నాయకుడు కాసర్ల స్వామి తదితరులున్నారు.



యూనిఫాంలను అందిస్తున్న ఐకేపీ సిబ్బంది

కామారెడ్డి రూరల్‌ : డీఆర్‌డీవో ఆదేశాల మేరకు మండలంలోని చిన్నమల్లారెడ్డి, లింగాయిపల్లి గ్రామాల్లో ప్రైమరీ పాఠశాలలో 324 యూనిఫాంలను మూడు పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు శుక్రవారం ఐకేపీ సిబ్బంది సీసీ విశ్వనాథ్‌ అందజేశారు. హెచ్‌ఎంలు హన్మాండ్లు, సిద్ధయ్య, గోపాల్‌, నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లపై పండిత పరిషత్‌ నాయకుల హర్షం

కామారెడ్డి అర్బన్‌ : కొనేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రమోషన్ల కల నిజం కాబోతున్నట్లు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌ జిల్లా అధ్యక్షుడు నార్ల అరుణ్‌కుమార్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గఫూర్‌శిక్షక్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లాలో 400మంది తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు, 95మంది వ్యాయామ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభిస్తున్నాయన్నారు.

ఆధ్యాత్మికం

కుంకుమార్చనలో మహిళలు



బిచ్కుంద(జుక్కల్‌) : మండలంలోని పుల్కల్‌ అన్నపూర్ణ మందిరంలో దేవి భాగ్‌వత్‌ పారాయణం సప్తహ కొనసాగుతోంది. శుక్రవారం మూడో రోజు శ్రీ చక్ర మహరాజ్‌ ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచక్ర మహరాజ్‌ మాట్లాడుతూ ప్రతిఒక్కరు దైవభక్తి పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

సరస్వతి మాత ఆలయంలో పూజలు



కామారెడ్డి రూరల్‌ : కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని ఇల్చిపూర్‌లో కొలువుదీరిన సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆర్చకుడు దత్తాద్రిశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్‌ పటేల్‌, కోలల సిద్దాగౌడ్‌ తదితరులున్నారు.

శబరి మాత ఆశ్రమంలో పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శబరిమాత చిత్రపటం, పాదుకలను పల్లకీలో ఉంచి భక్తిశ్రద్ధలతో డప్పువాయిద్యాల మధ్య ఆశ్రమం



ఆవరణలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, రాజాగౌడ్‌, సూర్యం, బాపురావు, రాములు తదితరులున్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి



నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో ఉన్న కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బాన్సువాడ ఆర్డీవో రమేశ్‌ రాథోడ్‌ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గిర్దావార్‌ అంజు, తహసీల్దార్‌, సిబ్బంది ఉన్నారు.

బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుక



ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ మాసంలోని అష్టమిని పురస్కరించుకుని అమ్మవారికి జ్యోతిష్య పండితులు హరిద్రా అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో రేవంతప్ప, సతీష్‌, మర్మల్ల వెంకటేశం తదితరులున్నారు.

సంక్షిప్తం


లయన్స్‌ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్‌): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్‌ క్లబ్‌ శాఖ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు భాస్కర్‌రెడ్డి 95 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ శిబిరంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షులు కిషన్‌, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో..

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : మండలంలోని మైలారం శుక్రవారం గ్రూప్‌ ఆఫ్‌ హెల్పింగ్‌ ఫ్రెండ్స్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌ మెడికవర్‌ ఆస్పత్రి సహకారంతో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంప్‌లో డా మోహన్‌ 350మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వలంటీర్‌ సునీల్‌ రాథోడ్‌, సురేష్‌, శ్రీకాంత్‌, గ్రామస్తులు మహేందర్‌ గౌడ్‌ తదితరులున్నారు.

సామాజిక సేవకుడు లియాఖత్‌ అలీ మృతి



పిట్లం(జుక్కల్‌) : ప్రభుత్వ ఉద్యోగానికి పదవీవిరమణ చేసినప్పటికీ మసీద్‌ల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేస్తూ మైనార్టీలకు సేవ చేసిన లియాఖత్‌ అలీ(75) శుక్రవారం మృతి చెందారు. ఇంజినీర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి రిటైర్మెంట్‌ అయినప్పటికీ కామారెడ్డి, నిజామాబాద్‌, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో వందకు పైగా మసీద్‌ల నిర్మాణాలను ఆయన పూర్తి చేశారు. పిట్లం మండల కేంద్రంలో మూడు మసీద్‌లను నిర్మించిన లియాఖత్‌ అలీ మృతి చెందడంతో ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అవుట్‌ సోర్సింగ్‌ టీచర్ల కోసం దరఖాస్తులు

బిచ్కుంద(జుక్కల్‌) : మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో అవుట్‌ సోర్సింగ్‌ పద్ధతిలో బోధించేందుకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్‌ సయ్యద్‌ అసదుల్లా తెలిపారు. ఇంగ్లీష్‌ సబ్జెక్టు బోధించేందుకు కావాలని పీజీ ఇంగ్లిష్‌, బీఎడ్‌ చేసిన వారు అర్హులన్నారు. అలాగే స్టాఫ్‌ నర్స్‌గా పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నామన్నారు. బీఎస్సీ నర్సింగ్‌, జీఎన్‌ఎం చేసిన వారు అర్హులు. ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని 9441027902లో సంప్రదించాలన్నారు.

నాన్‌ మైనారిటీ అడ్మిషన్లు..

పాఠశాలలో నాన్‌మైనార్టీ విద్యార్థుల అడ్మిషన్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్‌ తెలిపారు. 5 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవచ్చన్నారు. 20 తేదీ వరకు అడ్మిషన్లు పొందచ్చని సూచించారు.

చందాలు వేసి అంత్యక్రియలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పక్షవాతంతో మృతి చెందిన మండలంలోని చందాపూర్‌ గ్రామానికి చెందిన ఆవుల మాట రాజేందర్‌(45)కు గ్రామస్తులు శుక్రవారం చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్థికంగా వెనకబడి ఉన్న రాజేందర్‌ భార్య గతంలోనే మృతిచెందగా, ఆయన సుమారు 12రోజులుగా అనారోగ్యంతో అద్దెఇంట్లో తన ఇద్దరు కుమారులతో నివాసముంటున్నాడు. అయితే ఆరోగ్యం కుదుటపడకపోగా శుక్రవారం మృతిచెందాడు. దీంతో ఆయన ఇద్దరు కుమారులు అనాథలయ్యారు. రాజేందర్‌ చిన్ననాటి స్నేహితులు చిన్నారులకు నిత్యావసరాలు అందజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899